క్లుప్తంగా

8న ఆలయ వార్షికోత్సవం

పెద్దేముల్: ఈ నెల 8న తట్టెపల్లి దత్త స్వామి దేవాలయ 19వ వార్షికోత్సవం నిర్వహించటం జరుగుతుందని నిర్వాహకులు శంకర్‌మహరాజ్, మల్లికార్జున స్వామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7న రాత్రి భజనలు, 8న ఉదయం 6గంటల నుంచి 12గంటల వరకు అభిషేకం, హోమం.. అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు.

17న దుకాణాల వేలం

పరిగి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన దుకాణ సముదాయం లీజుకు ఈనెల 17న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి దుకాణానికి రూ.6వేలు నెలసరి అద్దె నిర్ణయించామని, అలా 12 షాపులకు అదే వర్తిస్తుందని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అందుకు దరఖాస్తు ఫారం రూ.100 చెల్లించి, ఈ నెల 6వ తేది నుంచి 10వ తేది వరకు పొందాలన్నారు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 17న వేలం వేస్తామని ప్రకటించారు. ఆసక్తిగల వారు పాల్గొనాలని సూచించారు.

ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేస్తాం

తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: పటిష్ట నిఘా ఏర్పాటు చేసి, ఇసుక దోపిడీని అరికడతామని తహసీల్దార్ విద్యాసాగర్ రెడ్డి చెప్పారు. బుధవారం 'సాక్షి'లో 'విచ్చలవిడిగా అక్రమ ఇసుక దందా' అనే శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇసుక చోరీకి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఇసుక తరలిస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రైవేట్, ప్రభుత్వ పనులకు ఇసుక అవసరం ఉంటే రూ.600 డీడీ చెల్లించి, ఇసుకను పొందాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూజారికి సన్మానం



అఖిలేశ్వర్ స్వామిని సన్మానిస్తున్న గ్రామస్తులు

బంట్వారం: సాంస్కృతిక కళానిలయం తరపున ఇటీవల నగరంలో నంది ఉగాది పురస్కారం అందుకున్న అఖిలేశ్వర్ స్వామిని బుగ్గాపూర్ గ్రామస్తులు గురువారం శాలువాతో సత్కరించారు. అఖిలేశ్వర్ స్వామి స్థానిక బుగ్గరామలింగేశ్వర ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకుడు వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



హోమంలో మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం చౌడాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

'చలో బుద్ధవనం' విజయవంతం చేయండి

మొయినాబాద్: గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా శుక్రవారం కారు ర్యాలీని నిర్వహించనున్నట్లు ఆల్ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నుంచి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వరకు నిర్వహించే కారు ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువజన సంఘాల నాయకులు, అంబేడ్కర్‌వాదులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

మొయినాబాద్: మండలంలోని అప్పోజీగూడలో బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం మండపారాధన మహోత్కృతువులు, జలాధివాసము, ధాన్యాధివాసము, హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటు కలేనా!

- అధిక లోడ్‌తో విద్యుత్ అంతరాయం
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు
- కరెంటు కష్టాలతో కర్షకుల పరేషాన్
- సబ్‌స్టేషన్ ఏర్పాటుకు డిమాండ్



దౌల్తాబాద్: పల్లెలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెండు మూడు గ్రామాలకు ఒక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని చెబుతుండగా.. సంబంధిత అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదు. మండలంలో 33 జీపీలు ఉండగా.. కేవలం నాలుగు సబ్‌స్టేషన్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఇందులో దౌల్తాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో గోకఫసల్‌వాద్ ఫీడర్‌కు ఐదు గ్రామాలతో పాటు చిన్నతండాలు ఉన్నాయి. దీంతో ఆ ఫీడర్ ఓవర్‌లోడ్‌తో గంటకు ఒకసారి ట్రిప్ అవుతోంది. మరమ్మతుకు ఒకే సబ్‌స్టేషన్ ఉండడం వలన ఏ గ్రామంలో మరమ్మతు చేయాలన్నా.. సరఫరా నిలిపివేయాల్సి వస్తోంది. దీంతో ఆ ఫీడర్ పరిధి గ్రామాల రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఒక్క సబ్‌స్టేషన్ కింద 10 గ్రామాలు

గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్, పోల్కంపల్లి, నందారం, దేశాయిపల్లి, ద్యానాయక్‌తండా, యాంకి, గుముదాల, అల్లాపూర్, తిమ్మాయిపల్లి గ్రామాలకు కలిపి ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్ దౌల్తాబాద్‌లో ఉంది. ఈ సబ్‌స్టేషన్‌తో పరిధిలో వ్యవసాయ బావులు, బోర్లు, క్రషర్లు, ఇటుక బట్టీలు, ఐదు మిల్లులు, ఫౌల్ట్రిఫామ్‌లు ఉండడంతో ఓవర్‌లోడ్ పడి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. విద్యుత్ ఓవర్‌లోడ్‌తో గంటకు ఒకసారి ట్రిప్ అవుతుండడంతో అన్నదాతలు పొలాల వద్దే రాత్రింబవళ్లు కాపలా ఉండాల్సి వస్తోంది. గోకఫసల్‌వాద్ ఫీడర్ మొత్తం సుమారు 8 కిలో మీటర్ల మేర ఉండడం వలన లూజ్ లైన్‌తో తరచూ ట్రిప్ అవుతున్నాయని విద్యుత్ సిబ్బంది చెప్పారు. పోల్కంపల్లి శివారులో గతంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినప్పటికీ ఇప్పటి వరకు అతీగతిలేదని రైతులు, మండల ప్రజలు వాపోతున్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



గోకఫసల్‌వాద్–పోల్కంపల్లి గ్రామాల మధ్య ఒక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. తరచూ ట్రిప్ కావడంతో ఇబ్బంది పడుతున్నాం. వర్షాకాలంలో అయితే చిన్న గాలి వీచినా విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతోంది. అధికారులు స్పందించి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.

– మధుసూదన్, గోకఫసల్వాద్

రైతు కష్టాలు తీర్చాలి



మండలంలో 33 గ్రామపంచాయతీలకు నాలుగు మాత్రమే సబ్‌స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. దీంతో కరెంటు కష్టాలతో రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గోకఫస్‌వాద్ ఫీడర్‌కు అదనంగా మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– కూరవెంకటయ్య, బీజేపీ, రాష్ట్ర నాయకుడు

భగీరథ నీటిని అందరూ తాగాలి

ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేస్తున్న నీరు సురక్షితమైనవని, ఆ నీటిని ప్రజలందరూ తాగాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ చెప్పారు. మీతోనేను కార్యక్రమంలో భాగంగా గురువారం లక్ష్మీనగర్, తిమ్మానగర్ తండాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. గిరిజనులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి విషయంలో ప్రజలు అపోహలు వీడాలని, అధికారులు తాగునీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇదిలా ఉండగా.. జాతీయ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.1.01 కోట్లతో స్టేషన్ ధారూరు, అవుసుపల్లి, తిమ్మానగర్, లక్ష్మీనగర్, డీకే తండాలు, ధారూరు మండల కేంద్రంలో నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే ఆనంద్ ప్రారంభించారు. జెడ్పీటీసీ సుజాత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, సర్పంచులు చంద్రమౌళి, స్వప్న, రేణుక, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మీతోనేను కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

పఠన శిబిరంతో విద్యార్థులకు మేలు

మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి

యాలాల: వేసవి పఠన శిబిరంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ముకుందాపూర్ ప్రాథమిక పాఠశాలలో పఠన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఎంఈఓ మాట్లాడారు. వేసవి శిబిరంలో కథలు, పాటలు, పద్యాలు, చతుర్విధ ప్రక్రియల్లో అభ్యాసం చేయిస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సహకరించిన హెచ్ఎం శ్రీనివాస్, యువతులు కవిత, విజయలక్ష్మిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతిబాయి, ఎస్ఎంసీ చైర్మన్ సాయప్ప, గ్రామస్తులు బాబ్యానాయక్, నర్సింహులు, ఉపాధ్యాయుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



వేసవి పఠన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ

అవార్డులు సరే.. క్రమబద్ధీకరణ ఎప్పుడు?



బషీరాబాద్: దీక్షలో కూర్చున్న కార్మికులు

కొడంగల్ రూరల్: పంచాయతిరాజ్ శాఖ అవార్డులు అందుకుంటున్నా.. అందుకు కారణమైన పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సీపీఐ నియోజకవర్గ నాయకుడు గంటి సురేష్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జేపీఎస్‌లు చేపట్టిన నిరసన దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. జేపీఎస్‌ల సేవలతో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వం పలు జాతీయ అవార్డులు పొందిందని, కాని వారి క్రమబద్ధీకరణ విషయం రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. జేపీఎస్‌ల సమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, కృష్ణవేణి, లావణ్య, అరుణ, అంజలి, చైతన్య, విజయభాస్కర్, కొండయ్య, మహబూబ్, వసీం తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు

బషీరాబాద్: సమస్యల పరిష్కారం కోసం జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె గురువారానికి 6వ రోజుకు చేరుకోగా.. దీక్షకు గ్రామ పంచాయతీ కార్మికులు మద్దతు ప్రకటించారు. దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

పదోన్నతులు కల్పించాలి

యాలాల: అర్హులైన ప్రతి పంచాయతీ కార్యదర్శికి పదోన్నతి కల్పించాలని మండల జేపీఎస్‌లు డిమాండ్ చేశారు. వారం రోజులుగా చేపడుతున్న కార్యదర్శుల సమ్మెలో భాగంగా తమ వినతులను అంబేడ్కర్ విగ్రహానికి సమర్పించి మాట్లాడారు. కార్యదర్శులను వెంటనే పర్మినెంట్ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను జేపీఎస్‌లుగా గుర్తించి, వారి విధులు నిర్వహించిన కాలాన్ని ప్రొబేషన్ కాలంగా పరిగణించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తారకచారి, సుధాకర్, వెంకటయ్య, కిరణ్, సునీల్‌కుమార్, పావని, లలిత, దీప తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఊరట



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం

- జూన్ నుంచి పెరగనున్న వేతనం

తాండూరు: ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం. అలాంటి కార్మికులకు మేడే సందర్భంగా రూ.వెయ్యి వేతనం పెంచుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం.. ఉత్తర్వులు జారీ కావడం వెనువెంటనే జరిగాయి. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు, వస్తున్న జీతాలతో కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం కార్మికులకు కాస్త ఊరట లభించనుండగా.. మొత్తం 2,528 మందికి లబ్ధి చేకూరనుంది.

జూన్ నెల నుంచి..

జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఐదు వందల జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడిని ప్రభుత్వం నియమించి, ఒక్కొక్కరికి ప్రతి నెల రూ.8,500 చొప్పున జీతం ఇస్తుండగా.. తాజాగా పెంచి రూ.వెయ్యితో జూన్ నెల నుంచి రూ.9,500 చొప్పున వేతనం అందనుంది. ఇందులో భాగంగా ప్రభుత్వం పంచాయతీరాజ్ అధికారులకు జీఓ జారీ చేసింది. ఈ జీపీల్లో మొత్తం 1,928 మంది పారిశుద్ధ్య కార్మికులు వీధులను శుభ్రం చేయడంతో పాటు తాగు నీటి సరఫరా, పల్లె ప్రకృతి వనాలలో చెట్లకు నీరు పోయడంతో పాటు తదితర పనులు చక్కబెడుతున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛసర్వేక్షణ్ పోటీ కోసం తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం లాంటి విధులు చేపడుతున్నారు.

మున్సిపాలిటీల్లోనూ వర్తింపు..

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటి పరిధిలో కార్మికులు రేయింబవళ్లు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. తాండూరు మున్సిపాలిటీలో 206 మంది, పరిగిలో 73 మంది, వికారాబాద్ 250 మంది, కొడంగల్ 71 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పెరిగిన వేతనాలు జూన్ నెల నుంచి..



పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం రూ.వెయ్యి వేతనం పెంచింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి అందాయి. జూన్ నెల జీతంతో పాటు పెరిగిన వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయి.

– నరేందర్‌రెడ్డి, మేనేజర్, తాండూరు మున్సిపాలిటీ

కర్ణాటకలో కాంగ్రెస్ విజయం ఖాయం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్

తాండూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్ అన్నారు. గురువారం కర్ణాటక సరిహద్దులోని చించోళి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సుభాష్‌రాథోడ్ తరపున గిరిజన తండాల్లో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత శాసనసభ ఎన్నికల్లో పార్టీ నుంచి విజయం సాధించిన ఎమ్మెల్యే ఉమేష్ జాదవ్.. పార్టీని మోసం చేసి బీజేపీలో చేరారని ఆరోపించారు. రాజకీయ భవిషత్‌ను ఇచ్చిన పార్టీని ఆయన మోసం చేశారని నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారని వెల్లడించారు. చించోళిలో సుభాష్‌రాథోడ్ 25 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని, మరో పక్షం రోజుల్లో కన్నడనాట 'హస్తం' అధికారం చేపట్టబోతుందని ఆశాభావం వక్తం చేశారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ధారాసింగ్, కాంగ్రెస్ నాయకులు

నిరుపేదలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: నిరు పేదలకు, బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు తాము అండగా ఉంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. గురువారం తిర్మలాపూర్‌లో గొల్ల లింగం అనే యువకుడు అనారోగ్యంతో మృతిచెందారు. ఓంకార్, గురు, శ్రీను అనే ముగ్గురు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అనంత రాములు అనే వ్యక్తి కల్లు గీసేందుకు చెట్టు ఎక్కి కిందపడటంతో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, రైతుబంధు మండల కమిటీ అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, నాయకులు సత్యనారాయణ, మహేశ్వరం రాములు, చిన్నయ్య, బాలయ్య, సార శ్రీనివాస్, పెద్ద నర్సింహులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడికి సన్మానం



పారిశుద్ధ్య కార్మికుడిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

పరిగి: పారిశుద్ధ్య కార్మికులతోనే పరిసరాలు శుభ్రంగా ఉంటాయని కృష్ణానగర్ కాలనీ వాసులు చెప్పారు. ఈ మేరకు గురువారం చెత్త సేకరించే కార్మికుడు కిష్టయ్యను కాలనీ వాసులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో కిష్టయ్య ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చేస్తున్నారని, ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తూ కాలనీని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుతున్నారని తెలిపారు. కాలనీ వాసులు నరేందర్‌రెడ్డి, కిషన్ పంతులు, ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

- మున్సిపల్ సమావేశంలో చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి
- పలు అంశాలపై తీర్మానాలు

కొడంగల్ రూరల్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపాలిటీ అభివృద్ధికి చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించగా.. కౌన్సిల్ ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసింది.

తీర్మానాలు ఇవి..

పురపాలక సంఘంలోని ప్రతి వార్డు అభివృద్ధికి రూ.10 లక్షలు, మెర్జిడ్ వార్డులకు అదనంగా రూ.4 లక్షలు, కోఆప్షన్ సభ్యులకు (వార్డు అభివృద్ధి కొరకు) రూ.4 లక్షల బడ్జెట్ కేటాయించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సీసీ చార్జీలు చెల్లించేందుకు అంచనా బిల్లు రూ.40 లక్షలు, వీధి దీపాల బిల్లు అంచనా రూ.15 లక్షలను ఈఈఎస్ఎల్‌కు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలపగా.. మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహించే సిబ్బంది వేతనాలు 2023–24 సంవత్సరానికి గాను రూ.1.60కోట్లు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉషారాణి, కౌన్సిలర్లు మధుయాదవ్, ప్రభాకర్‌గౌడ్, శంకర్‌నాయక్, శ్రీలత, సాయిప్రసన్న, రహత్‌బేగం, వెంకట్‌రెడ్డి, రమేష్, సరోజ, కోఆప్షన్ సభ్యులు పకీరప్ప, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'

డాక్టర్ బుచ్చిబాబు



నేత్ర శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ బుచ్చిబాబు

పెద్దేముల్: అంధత్వ నివారణనే కంటివెలుగు లక్ష్యమని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలోని 37 జీపీలకు గాను 30 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమం పూర్తి చేశామని చెప్పారు. ఆయా శిబిరాల్లో ఇప్పటి వరకు 10,037 మంది పురుషులు, 11,646 మంది మహిళలకు కంటి పరీక్షలు చేశామని, బుధవారం నాటికి 3,409 మందికి రీడింగ్ గ్లాసులు, 1,870 మందికి సైడ్ అద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. మరో 844 మందికి అద్దాలు ఇవ్వాల్సి ఉందని వెల్లడించారు. తట్టెపల్లి, రుద్రారం, రుక్మాపూర్, సిద్దన్న మడుగుతండా, కొండాపూర్‌లో క్యాంపులు నిర్వహించాల్సి ఉందని, ప్రస్తుతం పెద్దేముల్, రేగొండిలో క్యాంపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ నేత్ర శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సమస్య తీవ్రతను బట్టి అద్దాలు, మందులు ఇస్తామని చెప్పారు. అవసరం అయిన వారికి శస్త్ర చికిత్స చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్‌కుమార్, డీఈఓ వనిత, ఏఎన్ఎం వెంకటమ్మ, ఆశలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి

బంట్వారం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. గురువారం బంట్వారం వ్యవసాయ సహకార సంఘం గోడౌన్‌లో ఆయన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో వారికి అందుబాటులో కేంద్రాన్ని తెరిచామన్నారు. మార్క్‌ఫెడ్ నిర్ణీత ధర క్వింటాలుకు రూ.1,962 ఉందని, మొక్కజొన్నలో 14 శాతం తేమ ఉండాలని చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ ప్రతులు రైతులు తప్పని సరిగా తీసుకురావాలని, డబ్బులు నేరుగా ఖాతాల్లోనే జమ అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, సీఈఓ బ్రహ్మం, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ రాంచంద్రారెడ్డి తదితరులు

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

యాలాల: ద్విచక్రవాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ అరవింద్ సూచించారు. గురువారం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోయారని, హెల్మెట్ లేని కారణంగానే మృత్యువాత పడ్డారని చెప్పారు. హెల్మెట్ పెట్టుకోవడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అరవింద్